క్లుప్తంగా

దశదినకర్మకు హాజరైన ఎమ్మెల్యే బూచేపల్లి



వెంకట సుబ్బమ్మకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

దర్శి (కురిచేడు): రాష్ట్ర నెట్‌కాప్ మాజీ డైరెక్టర్ సానికొమ్ము తిరుపతిరెడ్డి తల్లి పెద్ద వెంకట సుబ్బమ్మ దశదినకర్మకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మంగళవారం హాజరయ్యారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, రాష్ట్ర గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ మాజీ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, దొనకొండ మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, సర్పంచుల సంఘ అధ్యక్షుడు కేసరి రాంబూపాల్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు చింతలపూడి శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు మేడం మోహనరెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, కేసరి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన రేణుకా ఎల్లమ్మ కొలుపులు



ఎల్లమ్మ వద్ద బొల్లావు ఉత్సవం

దొనకొండ: మండలంలోని వెంకటాపురం బ్రాహ్మణపల్లిలో రేణుకా ఎల్లమ్మ కొలుపులు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం కొలుపుల ముగింపు కావటంతో బొరిగొర్ల వంశం వారు జమ్మి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. నూతన వస్త్రాలు ధరించి రేణుకా ఎల్లమ్మకు ప్రదక్షిణ చేశారు. అన్నదానం చేశారు. బొల్లి ఆవులతో గ్రామ పురవీధుల్లో భజంత్రీలు, మేళ తాళాలతో ఊరేగింపు చేశారు.

ఘనంగా ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం



మహబూబ్ బాషాను సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కురిచేడు: స్థానిక కోట బజారులోని మండల పరిషత్ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవం మంగళవారం ప్రధానోపాధ్యాయుడు షేక్ ఖాజారహంతుల్లా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ నృత్యాలు అలరించాయి. అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో డి.అశ్విని, పాఠశాల సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి శివరామకృష్ణ, మండల అధ్యక్షుడు వి.బాలనాయక్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వీవీ రమణారావు, నాయకులు కె.నాగిరెడ్డి, ఎం.పెద్దిరెడ్డి, వై.శ్రీనివాసరావు, షేక్ దాదాసాహెబ్, షేక్ సుభానీ, వల్లి, కె.మహితేజ, ఎస్వీఎల్ సుబ్బారావు, యూటీఎఫ్ నాయకులు శ్రీనివాసరెడ్డి, షేక్ ఖాదర్‌వలి, ఎం.శ్రీనివాసరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏపీ ఫైబర్ నెట్‌తో ఇబ్బందులు



ఎర్రర్ చూపుతున్న ఏపీ ఫైబర్ నెట్‌వర్క్

కురిచేడు: ఏపీ ఫైబర్ నెట్ నిర్వహణ తీరు వినియోగదారులను ఇబ్బందులకు గురి చేస్తోంది. వారు వేరే ప్రైవేటు నెట్‌వర్క్‌ను ఎంపిక చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. 9 నెలల కాలంలో ఏపీ ఫైబర్ నిర్వహణ అధ్వానంగా తయారైంది. నిత్యం మరమ్మతుల పేరుతో గంటల కొద్దీ సిగ్నల్ కట్ చేస్తున్నారు. తాజాగా మంగళవారం ఉదయం నుంచి ఏపీ ఫైబర్ సిగ్నల్ లేక వినియోగదారులు అవస్థలు పడ్డారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి విషయం ఆన్‌లైన్‌లో చేయాలని, ప్రతి ఇంటికి ఏపీ ఫైబర్ ఉండాలని, రోజురోజుకూ నెట్‌వర్క్ అభివృద్ధి చేస్తున్నామంటూ ప్రకటనలే తప్ప ఒరిగిందేమీ లేదని వినియోగదారులు విసుక్కుంటున్నారు. పొమ్మన లేక పొగబెట్టినట్లు ఏపీ ఫైబర్ వ్యవహారం ఉన్నట్లు అర్థమవుతోందని, ప్రైవేటు నెట్‌వర్క్‌లను ఎంపిక చేసుకోవడం మినహా ప్రత్యామ్నాయం లేదని వినియోగదారులు ఆలోచిస్తున్నారు. ఏపీ ఫైబర్ అధికారులు సక్రమంగా నిర్వహణ చేయకపోతే డిపాజిట్లు వెనక్కు ఇప్పిస్తే వేరే నెట్ వర్క్‌లోకి వెళ్తామని వినియోగదారులు పేర్కొంటున్నారు. ఏపీ ఫైబర్ ఏర్పడ్డాక నిర్వహణ ఇంత దారుణంగా ఉండటం ఇదే ప్రథమం అని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏపీ ఫైబర్ అధికారులు తమ విధానం మార్చుకోకుంటే భారీ మూల్యం తప్పదని వినియోగదారులు హెచ్చరిస్తున్నారు.

విద్యార్థులూ.. ఒక్కసారి ఆలోచించండి!

- నేడు పదో తరగతి ఫలితాలు

పుల్లలచెరువు:

ఇటీవల ఇంటర్ ఫలితాలు విడుదులయ్యాయి. ఉత్తీర్ణులు కాలేకపోయామనే మనస్తాపంతో పలు చోట్ల ఇంటర్ విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్న సంఘటను ఉన్నాయి. ఆలా క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయాలతో పలు కుటుంబాల్లో తీరని విషాదం చోటుచేసుకుంది. నేడు పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదుల కానున్నాయి. ఆ ఫలితం ఎలా ఉన్నా మంచి దృక్పదంతో మందుకు సాగాలని విద్యావేత్తలు విద్యార్థులకు సూచిస్తున్నారు. పదో తరగతి జీవితంలో ఒక మెట్టులాంటిది. ఒక దశ నుంచి మరో దశకు చేరుకునే సాధనం. అయితే ఇదే అంతిమ ఫలితం కాదని గుర్తించాలి. ఫెయిల్ అయ్యామన్న బెంగతో ఆత్మస్థైర్యం కోల్పోయి క్షణికావేశంలో ప్రాణాలు తీసుకోవద్దని విద్యావేత్తలు సూచిస్తున్నారు. ఇలాంటి విద్యార్థులకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం అండగా నిలవాలని పేర్కొంటున్నారు. ప్రయత్న లోపం లేకుండా కష్టపడటం ప్రతి ఒక్కరూ చేయాల్సిన పని. ఒక్కోసారి కష్టపడినా, పరీక్ష బాగా రాసినా సాంకేతిక తప్పిదాల కారణంగా ఫలితం తారుమారు కావచ్చు. అలాగని మన నిండు జీవితాన్ని నిలువునా మంచేసుకుంటామా..ఒకసారి ఆలోచించమని విద్యావేత్తలు కోరుతున్నారు.



పదో తరగతి విద్యార్థులు (ఫైల్)

తల్లిదండ్రులు పిల్లలతో స్నేహంగా ఉండాలి:



పదో తరగతి దశలో పిల్లలు పూర్తిస్థాయిలో ఆలోచించలేరు. స్వతహాగా నిర్ణయాలు తీసుకోలేరు. ఫలితాలు ఏ విధంగా ఉన్నా తల్లిదండ్రులు వారిని అక్కున చేర్చుకుని స్నేహంగా ఉండాలి. పాస్, ఫెయిల్ రెండు భాగాలు మాత్రమే. అటుపోట్లను అంగీకరించాలి. లోపాలు సరిదిద్దుకోవాలి. జీవితంలో అనేక అవకాశాలు ఉన్నాయని గుర్తించాలి. తల్లిదండ్రులు తమ పిల్లలను మానసికంగా సిద్ధం చేయాలి. ఇతరులతో పోల్చడం మనుకోవాలి. మార్కులు, గ్రేడ్‌లతో విజయాన్ని అంచనా వేయవద్దు.

శామ్యూల్ జాన్, డిప్యూటీ డీఈవో, మార్కాపురం

నచ్చిన రంగం వైపు దృష్టి పెట్టాలి:



పదో తరగతి జీవితంలో ఎదుగుదలకు సంబంధించిన ఒక మెట్టు మాత్రమే. పదిలో మొదటి సారి ఫెయిలైన విద్యార్థులు మంచి స్థానాల్లో రాణిస్తున్నారు. తక్కువ, ఎక్కువ మార్కులు అనే విషయాన్ని పక్కన పెట్టాలి. ఫెయిలైన విద్యార్థులు ఆసక్తి ఉంటే మరో మారు పరీక్ష రాయాలి. లేదంటే నచ్చిన రంగం వైపు దృష్టి పెడితే త్వరగా స్థిరపడవచ్చు. ఉదాహరణకు ప్రస్తుతం ఫేస్‌బుక్ తెలియని వారుండరు. చిన్నప్పుడే మంచి ఆలోచన చేసి ముందుగా సాగడంతో ఉత్తమ రంగంలో స్థిరపడవచ్చు.

లిల్లీప్రకాశ్‌వాణి, కేజీబీవీ ప్రిన్సిపాల్, పుల్లలచెరువు

ఒబ్బాపురానికి సాగర్ నీరు బంద్

- తాగునీటికి ఇబ్బంది పడుతున్న ప్రజలు
- ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు విన్నవించినా ఫలితం శూన్యం

దొనకొండ: మండల కేంద్రం దొనకొండలోని ఒబ్బాపురంలో సాగర్ నీరు సరఫరా గాక 2 నెలలు కావస్తోంది. అధికారులకు ఎన్నిసార్లు సమాచారం అందించినా స్పందించిన దాఖలాలు లేవని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకు వేసవి ప్రతాపం ఎక్కువ ఉందని, సాగర్ నీరు తప్పా ఈ ప్రాంతంలో చేతి పంపులు, డీప్ బోర్లు లేవని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 2 వేల మంది జనాభా నివసిస్తున్నారు. సాగర్ నీరు రాకపోవడంతో డబ్బు వెచ్చించి మినరల్ వాటర్ కొనుగోలు చేస్తున్నారు. మినరల్ వాటర్ కొనలేని వారు ఫ్లోరైడ్‌తో కూడిన నీటిని తాగి వ్యాధులకు గురవుతున్నారు. గతంలో 15 రోజులకు ఒక్కసారి సాగర్ నీరు వచ్చేది. నేడు అలాంటి పరిస్థితి లేదని పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. ఎన్నోసార్లు ఒబ్బాపురానికి సాగర్ నీరు సరఫరా కావటం లేదని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో చాలా మంది పేదవారు. రెక్కాడితేగానీ డొక్కాడని పరిస్థితి ఉంది. ఇలాంటి పరిస్థితిలో సాగర్ నీరు సరఫరా కాక పోవడంతో తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు ఎన్నికల ముందు వస్తున్నారు.. పోతున్నారు.. తప్ప తమ గోడు పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఒబ్బాపురం గ్రామ ప్రజలను దృష్టిలో ఉంచుకుని వెంటనే సాగర్ నీరు సరఫరా అయ్యేలా చూడాలని ముక్త కంఠంతో కోరుతున్నారు.

అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు:



ఒబ్బాపురానికి తాగునీరు సరఫరా కాలేదని, నీరు లేక ఇబ్బందికరంగా ఉందని ఎన్నోసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోకుండా మాట దాటేస్తున్నారు. మా కిష్టం.. సరఫరా చేసినప్పుడే నీరు పట్టుకోండి.. లేకుంటే లేదంటున్నారు. 2 నెలల నుంచి సాగర్ నీరు రాక ఫ్లోరైడ్ నీటిని తాగి వ్యాధులకు గురవుతున్నాం.

కుమార్, ఒబ్బాపురం

చదువుతోనే ఉజ్వల భవిష్యత్



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ఎంఈఓ సుబ్రహ్మణ్యం

పెద్దారవీడు: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ-2 సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలో ప్రగళ్లపాడు ఎంపీపీ పాఠశాల వార్షికోత్సవం హెచ్‌ఎం గుర్రపుశాల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ-2 మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే జీవిత లక్ష్యలను నిర్దేశించుకుని కష్టపడి చదువుకొని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలన్నారు. విద్యతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని, పట్టుదల, క్రమశిక్షణ ఉంటే విద్యార్థులు ఏదైనా సాధించగలరని చెప్పారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి సేవాభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. బడి ఈడు పిల్లలు కచ్చితంగా ప్రభుత్వ పాఠశాలలో చదివే విధంగా ఉండాలని, విద్యార్థులకు చక్కని విద్య లభిస్తుందని తెలిపారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఎంఈఓను ఉపాధ్యాయులు శాలువాతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సర్పంచ్ కంచర్ల చెన్నమ్మ, ఉపాధ్యాయులు పి.రామశేఖర్, జి.వెంకటరావు, శ్రీరామ్‌శెట్టి, వి.శ్రీనివాసులు, స్కూల్ చైర్మన్ ఎం.ఆదిలక్ష్మి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతులు



మెరిట్ సాధించిన విద్యార్థులతో ఎంపీపీ కిరణ్ గౌడ్

యర్రగొండపాలెం: చలమారావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక రెయిన్‌బో హైస్కూల్లో ఏర్పాటు చేసిన టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులకు మంగళవారం ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్ నగదు బహుమతులు అందచేశారు. 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదివే విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ ఏర్పాటు చేసినట్లు ఆ హైస్కూల్ కరస్పాండెంట్ దొంతా కిషోర్‌గౌడ్ తెలిపారు.

కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం



కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పెద్దదోర్నాల: ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌కు ఆమోదం లభించిన నేపథ్యంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేస్తూ మందా కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కృష్ణమాదిగ కృషి వల్లే ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్‌కు ఆమోదం లభించిందని నాయకులు పేర్కొన్నారు. సింగా బూషి, కిరణ్, కిశోర్‌కుమార్, కటికల జీనా, కటికల దానం, సింగా పోల్‌రాజు, పూర్ణకంటి తెల్లయ్య, గోదా నాగయ్య, కలికెల వెంకటయ్య, పందిటి కిశోర్, కిరణ్, పూర్ణకంటి ఆవులబాబుతో పాటు ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొని మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

మహిళాభ్యున్నతికి కుట్టుమిషన్లు



కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈడీ వెంకటేశ్వరరావు

దర్శి (కురిచేడు): మహిళలు ఆర్థికంగా వృద్ధి చెందేందుకు ప్రభుత్వం కుట్టుమిషన్‌పై శిక్షణ ఇస్తోందని బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రెండు కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శిక్షణ తరగతులకు హాజరయ్యే వారు 75 శాతం హాజరు ఉంటేనే ఉచితంగా కుట్టుమిషన్ అందజేస్తామని తెలిపారు. భవిష్యత్‌లో వారికి స్వశక్తితో ఎదిగేందుకు వీలుగా రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. శిక్షణా కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓ ఎల్. కృష్ణమూర్తి, నగర పంచాయతీ కమిషనర్ మహేష్ పాల్గొన్నారు.

దేవాలయానికి శిద్దా విరాళం



విరాళం అందజేస్తున్న సుధీర్ ప్రతినిధులు

ముండ్లమూరు (కురిచేడు): మండలంలోని కెల్లంపల్లి పంచాయతీ శ్రీనివాసనగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు శిద్దా సుధీర్ రూ.30 వేల విరాళం మంగళవారం అందజేశారు. తన ప్రతినిధి మండాది సుబ్బారావు ద్వారా గ్రామ పెద్దలకు విరాళాన్ని అందించినట్లు గ్రామస్తులు తెలిపారు. విరాళాన్ని గ్రామ పెద్దలు గాయం వెంకటేశ్వర్‌రెడ్డి, తాళ్ల ఇంద్రసేనారెడ్డి, నాగసాని రఘుపతిరెడ్డి, కర్నాటి సాయికుమార్‌రెడ్డిలు అందుకున్నారు. బొగ్గవరపు సుబ్బారావు పాల్గొన్నారు.


సెల్ టవర్ల బ్యాటరీ దొంగల అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై కమలాకర్

ముండ్లమూరు (కురిచేడు): ఇటీవల కాలంలో సెల్ టవర్ల బ్యాటరీలు దొంగిలించిన దొంగల ముఠాను సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. మంగళవారం పాత్రికేయుల సమావేశంలో ఆయన కేసు వివరాలు వెల్లడించారు. మండలంలోని వేంపాడు జంక్షన్ వద్ద నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. జె.పంగులూరుకు చెందిన కారుమంచి ఖాసిం, ఇంకొల్లు మండలం గంగవరం గ్రామానికి చెందిన షేక్ జాన్‌వలి, షేక్ జయాలబ్దిన్, మార్టూరు మండలం ద్రోణాదులకు చెందిన కాటూరి జాలయ్యలను అదుపులోకి తీసుకుని విచారించారు. వారు మండలంతో పాటు బాపట్ల జిల్లా చిన్నగంజాం, ఇంకొల్లు, పర్చూరు మండలాల్లోని పలు టవర్లకు చెందిన బ్యాటరీలను దొంగతనం చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. నిందితుల నుంచి రూ.4.40 లక్షలు విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. కేసులో ప్రతిభ కనబరిచిన ఎస్సై కమలాకర్, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

డిప్యుటేషన్లు రద్దు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓలు

దర్శి (కురిచేడు): వర్క్ అడ్జస్ట్‌మెంట్ కోసం ఇతర పాఠశాలల నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన వారు తిరిగి పాత స్థానాల్లో చేరేందుకు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంఈఓ రఘురామయ్య తెలిపారు. మండలంలోని బండివెలిగండ్ల పాఠశాలను ఆయన మంగళవారం ఎంఈఓ-2 రమాదేవితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పాత స్థానాలకు వెళ్లే ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటితొట్లను శరవేగంగా నిర్మించాలి



నీటితొట్టెని పరిశీలిస్తున్న ఏపీడీ లలితకుమారి

తాళ్లూరు: వేసవి కాలం దృష్ట్యా పశువులకు నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని, నీటితొట్లు శరవేగంగా నిర్మించాలని ఉపాధి హామీ పథకం ఏపీడీ ఆర్. లలితకుమారి అన్నారు. మండల కేంద్రం తాళ్లూరులో మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఆమె ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ కూలీలను పెంచాలని, వారికి రోజుకు 300 రూపాయలు వచ్చేలా పని చేసే విధానంపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం తూర్పు గంగవరంలో నిర్మించిన నీటి తొట్లను ఆమె పరిశీలించారు. ఏపీఓ కె. వెంకటేశ్వర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బూచేపల్లి

వైఎస్సార్ సీపీ కార్యకర్తలతో బూచేపల్లి సమీక్ష

దర్శి (కురిచేడు): నియోజకవర్గంలోని ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలతో దర్శి శాసనసభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మంగళవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు మండల పార్టీ అధ్యక్షులు కృషి చేయాలని, అన్ని మండల కమిటీల అనుబంధ సంఘ కమిటీలను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో ఏ సమస్య వచ్చినా మండల నాయకులు కలిసికట్టుగా నిలబడాలని సూచించారు. సమావేశంలో 5 మండలాల అధ్యక్షులు వెన్నపూస వెంకటరెడ్డి, కాకర్ల కృష్ణారెడ్డి, యన్నాబత్తిన వెంకట సుబ్బయ్య, చింతా శ్రీనివాసరెడ్డి, తూము సుబ్బారెడ్డి, దర్శి పట్టణ అధ్యక్షుడు ముత్తినీడి సాంబ, ముండ్లమూరు, కురిచేడు జెడ్పీటీసీలు రత్నరాజు, నుసుం వెంకట నాగిరెడ్డి, ముండ్లమూరు ఎంపీపీ సుంకర సునీత బ్రహ్మారెడ్డి, మాజీ ఎంపీపీలు పోశం మధుసూదన్‌రెడ్డి, ఇత్తడి దేవదానం, వీరగంథం కోటయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ మాజీ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ఎస్.రాజయ్య, నియోజకవర్గ వైఎస్సార్ టీయూసీ అధ్యక్షులు బొమ్మిరెడ్డి లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

దేవప్రసాద్ సతీమణి మృతదేహానికి బూచేపల్లి నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి

దర్శి (కురిచేడు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్ సతీమణి గ్రేస్ రోజ్‌మణి మృతదేహానికి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నివాళులర్పించారు. మృతదేహాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. అనంతరం దేవప్రసాద్‌ను ఓదార్చారు. పార్టీ ముఖ్యనాయకులు నాయకులు కె.నాగేశ్వరరావు, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వైవీ భద్రారెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్‌బాబు తదితరులు దేవప్రసాద్‌కు ఫోన్‌లో తమ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దర్శి మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, కురిచేడు జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గోగులమూడి లింగారెడ్డి, క్రిస్టియన్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జి.కృపానందం, జి.ఏసుదాసు, క్రిస్టియన్ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ గుంటు పోలయ్య, నాయకులు మధుసూదన్‌రెడ్డి, కె.జాన్, ఇత్తడి దేవదానం, గర్రిపూడి సామేలు, డగ్లస్, పీస్ గాస్పెల్ మినిస్ట్రీస్ డైరెక్టర్ బి.శ్యాంసన్, సీనియర్ పాస్టర్లు కె.నాగేశ్వరరావు, జి.నరేంద్ర కుమార్, సూర్యచంద్ర, వై.స్టీవెన్‌బాబు, డానియెల్ పాల్, సుందరరావులు నివాళులర్పించారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి



ఆరో తరగతిలో చేరిన విద్యార్థులతో ఎంఈవోలు, హెచ్‌ఎంలు

యర్రగొండపాలెం: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఈవోలు పి.ఆంజనేయులు, మల్లు నాయక్ కోరారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొత్తగా 6వ తరగతిలో చేరేందుకు వచ్చిన విద్యార్థులకు అడ్మిషన్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృత్తి పట్ల చిత్తశుద్ధి, అంకిత భావంతో పనిచేస్తే విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరే అవకాశం ఉంటుందని, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు సమన్వయంగా ఇంటింటికీ తిరిగి చిన్నారుల తల్లిదండ్రుల్లో అవగాహన కల్పిస్తే వారు ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతిలో చేరిన 25 మంది విద్యార్థులకు ఆ పాఠశాల ఉపాధ్యాయులు స్వీట్లు పంచి ఆహ్వానించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు నాగరాణి, జె.వెంకటేశ్వర్లు, కృష్ణారావు, లక్ష్మి, నందగోపాల్, శేషారావు, జేమ్స్‌పాల్, సాదిక్, బాలిబాయి, శ్రీకాంత్, టి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పద్మనాభరెడ్డి సేవలు మరువలేనివి



పద్మనాభరెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

త్రిపురాంతకం: విద్యార్థులు ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయుడు పద్మనాభరెడ్డి సేవలు మరువలేనివని మండల విద్యాశాఖ అధికారులు అన్నారు. మండల కేంద్రం త్రిపురాంతకం బ్రహ్మంగారి కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశా ప్రధానోపాధ్యాయుడు ఎం.పద్మనాభరెడ్డి నెలాఖరుకు పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా ఆయన దంపతులను శాలువా, పూలమాలలతో ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఎంఈఓలు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ఎనలేని సేవలు అందించారని, 34 సంవత్సరాల పాటు విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఉపాధ్యాయ యూనియన్ నాయకులుగా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. ఎంఈఓలు మల్లికార్జుననాయక్, టి. రాజశేఖరరెడ్డి, వస్తంనాయక్, విశ్రాంతి ఎంఈఓ రామచంద్రారెడ్డి, ప్రధానోపాధ్యాయులు హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా డిగ్రీ కళాశాల వార్షికోత్సవం



డిగ్రీ విద్యార్థులతో అధ్యాపకులు

దర్శి (కురిచేడు): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ ఏడాది బీకాం, బీఏ, బీఎస్సీలో నూరుశాతం ఫలితాలు వచ్చాయని ప్రిన్సిపాల్ డాక్టర్ కవిత పేర్కొన్నారు. జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్.కోటయ్య, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెడ్ మాస్టర్ కాలేషావలిలు గురువుల ప్రాధాన్యం వివరించారు. విద్యార్థులకు నైపుణ్యం, క్రమశిక్షణ ప్రాధాన్యం గురించి సమాజసేవకులు జీవీ రత్నం వివరించారు. ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని, యోగాతో కలిగే ప్రయోజనాలను డాక్టర్ కె.ఝాన్సీ తెలిపారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రభుదాసు, బి.శ్రీనివాసరెడ్డి, కళాశాల టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.